స్కెచ్

# బాగులేని రోజులు

నారాయణరావు

రోజులు బాగులేవంటున్నారు. ఈ మాట ఎంతమందికి అర్థమయిందో తెలియదు కాని, అతనికి మాత్రం అర్థం కాలేదు. రోజులు బాగులేకపోవడమేమిటి? ప్రతిరోజూ సుమారు ఒకేలా ఉంటోందే! చిత్రకారుడు బాబుకి రోజులు బాగులేవు, శ్రీమంతుడు, మోహనలాల్‌కీ రోజులు బాగులేవు. గుమాస్తా రామదాసుకి రోజులు బాగులేవు, కంపోజిటరు సూర్యనారాయణ రోజులూ బాగులేవు...యింతమంది యీ మాట పదేపదే వినిపించగా ఏదో గుండెమీద చెయ్యి వేసుకుని అర్థమయినట్టే అనిపించింది కాని, నిజానికి తననే ఆ ప్రశ్న వేసుకుంటే సమాధానం చెప్పలేడు. రానురాను ఆ మాటకి తను అలవాటుపడ్డాడంతే కాని, అర్థం కాలేదు.

ఈ మాట చాలాసార్లనగా విన్నాడు. ఇంక బాగులేదు రోజులు బాగులేకపోవడానికి మందు ఏమిటో తెలుసుకోక పోవడం బాగులేదు రాఘవరావు రోజులు బాగులేవు అంటే తనకంత విశేషంగా అనిపించలేదు. ఎందుకంటే అందుకు కారణం తనకి తెలుసు. వాడి విషయం వేరు. అది శృంగారం. ఆ అమ్మాయి కళ్లు వీడికేసి తిరిగిన రోజున రోజుల విషయం మాట్లాడడు. కాలేజీ వదలగానే వెనకాలే బయలుదేరి, ఆ అమ్మాయిని వాళ్లింటిదాకా అప్పజెప్పి, సంతృప్తిగా యింటికి వస్తాడు. ఏదేనాఅవాంతరం వచ్చిందో, రోజుల్ని అనరాని మాటలంటాడు. కాని పాపం వాడి విషయం ఆ అమ్మాయికేం తెలుసు? ఆ అమ్మాయికి తెలియదని వీడికేం తెలుసు! రాఘవరావు రోజులు బాగులేవనడంవల్ల వచ్చిన ప్రమాదం లేదు. కాని పేచీ ఏమిటంటే యింకా చాలా మంది అంటున్నారు.

చిత్రకారుడు బాబునడిగాడు: ఏమిరా, రోజులు బాగులేవంటావుకదా, అంటే ఏమిటిరా అర్థం? బాబు మూతిపొడుగ్గా పెట్టి, "నీమొహం, నీకేం, చెప్తావ్! బొమ్మలు వేసుకోలేక పోతున్నాను చిత్రకళని ఏ పెద్దమనిషీ అర్థంచేసుకోడు. అర్టు, అర్టు, అని అవురావురని అరవటమే కాని ఒక్కడికి నిజంగా అదేమిటో అర్థం కాదు. ఏది మంచి చిత్రమో, ఏది కాదో నిజాయితీగా నిర్ణయించే పెద్దమనిషి లేడు. ఎత్తునఉన్న చిత్రకారుల బొమ్మలు చూపించి —"యివి ఫలానావారు చిత్రించినవి" అని చెప్పిన తరువాతగాని- ఆ బొమ్మ మంచిదని అనలేరు వీళ్లు. ఆయన పేరు వినగానే, అమాంతం గొంతుచించుకుని, "ఆహా! ఎంత మహోన్నత కళాఖండం, ఎంత ఉదాత్త భావన, ఎంత సుందరమైన, లలితమైన, రేఖ"అని అలవాటయిన పడికట్టుమాటలు అప్పజెప్పేస్తారు. "కళారాధకుల"ప్రపంచం యిలాంటి దౌర్భాగ్య దశలో ఉంది.

ఇది మంచిబొమ్మ యిదికాదు. ఇది ఉత్తమ చిత్రం ఇందులో విశిష్టతలేదు. అని వివరించి కొన్ని కొలతబద్దల సహాయంతో స్థూలంగానైనా నిజాయితీగా, హృదయంతో అనుభవించి చెప్పగల వాళ్లు లేరు. మనకీ మనలో విద్యావంతులైన చాలామందికీ ఆ సంస్కార్యంలేదు. లేదని పైకి చెప్పుకోగల ధైర్యంలేదు. తిండిపెట్టని యీ బొమ్మల్ని వదిలేద్దామా అంటే, చాలా ఆలస్యమయిపోయింది ఇప్పుడు నేను వదల్లేను. రోజులు బాగులేవురా-పిల్లకాకీ, నీకేం తెలుసు ఉండేలు దెబ్బ?"

పాపం. చిత్రాలకీ, వాడికీ ఆదరణా కీర్తీలేదు కాబట్టి యీ మాటలన్నాడు. వీడి రోజులు కొన్ని బాగులేవేమో. కాని, అందరి రోజులూ బాగులేవనడానికి వీడికేమిటీ ధైర్యం? అతనికర్థంకాలేదు.

మిల్లు యజమాని మోహనలాల్.

"రోజులు బాగలేవండీ, ప్రతి వెధవా సంఘములో చేరిపోయినవాడే, మరీ కమ్యూనిజం

బలిసిపోతోందండీ, యీ కూలీ ముండాకొడుకులకి కొమ్ములొచ్చాక యిక దేశమేమిటి? ఉత్పత్తేమిటి? ఊఁ అంటే సమ్మె, ఆఁ అంటే సమ్మె, నాడే ప్రభుత్వమైతే నిలువునా పూడ్చేసేవాడిని వాళ్ళని-వాళ్ళ సంఘాలనీ. ఇక ప్రభుత్వం చూసినా మామీదే స్వారీచెయ్యడం. పన్నులూ, సంపన్నులమీదే పన్నాగాలూ వాళ్ళమీదే. ఇక మాకు ఉత్పత్తి ఎక్కువ చెయ్యాలనీ, దేశసంపద బాగుపరచాలనీ ఎందుకనిపిస్తుంది చెప్పండి? మాకు ఎవరూ ఉత్సాహం యివ్వకుండా, మేము దోపిడీదారులమనీ, రాక్షసులమనీ వర్ణించడం ఫేషన్ అయిపోయింది. మా యీ పనికన్నా కూలీపని నయం. బాధ్యతారహితం, ఏదో కూలి డబ్బులేనా హాయిగా కిడతాయి. వెనవరోజులు-వెనకటి కాలంలో యింత ఘోరంగా లేదండీ!" అని ముగించాడు తన సన్నని తెల్లని గ్లాస్కో-పంచె కుచ్చెళ్ళు చేతితో ఆడిస్తూ.

గుమాస్తా రామదాసు నడిగితే కాగితాలమధ్య చచ్చిపోతున్నాంరా...పొద్దున్న నుంచీ సాయంత్రం దాకా, అక్కడ పడికట్టుకున్నా, వచ్చే డెబ్భయినాలుగు రూపాయిలూ చచ్చిపోవడానికి కూడాచాలవు. అయినా యిస్త్రీబట్టలు వెయ్యాలి-నాకన్నా కూలివాడు నయం, గోచీతో పనికి పోతాడు...కడుపునిండా కలిగింది తింటాడు. పైకి నవ్వుతూ గౌరవం పొందుతున్నట్టు కనపడాలి. డబ్బున్నవాడికీ పరవాలేదు, లేనివాడికీ పరవాలేదు. ఈ మధ్యతరగతి బతుకు పగవాడికేనా వద్దు బాబూ...యీ వెధవరోజుల్లో — అన్నాడు.

ఆతనికి మతి చెడినంత పనయింది, దీనిలో గొడవ ఏమిటో చివరంటా చూడాలి. అతనికి జ్ఞాపకమున్నవాళ్ళల్లో, యీ మాట అనేవాడు కంపోజిటరు సూర్యనారాయణ ఉన్నాడు. అతని నడగాలి.

ఇక అతను "బాబూ, పొద్దున్న నుంచీ, సాయంత్రందాకా యీ అక్షరాలలో అక్షరమైపోతాము, కళ్లు బలపాలు కట్టిపోతాయి. అక్షరాల మధ్య నలిగిపోయిన బతుకంతా నలిగిన


# హిందూస్థాన్ కో-ఆపరేటివ్ ఇన్స్యూరెన్సు సొసైటీ లిమిటెడ్ లో

ఒక జీవితభీమా పట్టా తీసుకొని మీ భవిష్యత్తు భద్రపరచుకోండి.

మానవావసరములను తీర్చగల మహనీయ సంస్థ.

ఆంధ్రదేశంలో వ్యాపార సంబంధీకుల అవసరాలు తీర్చుటకై 1945లో విజయవాడయందు ఒక బ్రాంచిని నెలకొల్పినది.

ఈ దిగువ అంకెలు ఈ సొసైటీ సౌష్ఠవాన్నీ, ఋజుత్వాన్నీ, బలాన్నీ నిరూపించుచున్నవి.


| | | |
|---|---|---|
| అమలునందున్న వ్యాపారము | రు. | 86,71,85,040 |
| ఆస్తుల మొత్తము ... | రు. | 22,49,83,056 |
| జీవిత, ఇతర చిల్లర, నిధి | రు. | 19,77,76,287 |
| చెల్లించిన క్లెయిములు (1952) | రు. | 88,82,271 |

ఆంధ్ర జిల్లాలలో యీ సొసైటీకి ప్రతినిధులు కాదలచినవారు యీ క్రింది చిరునామాకు వ్రాయండి :

**ఐ. కె. రాయ్, బి. ఏ.**

బ్రాంచి మేనేజరు, విజయవాడ.

పోస్టుబాక్సు నెం. 12. బకింగ్‌హామ్ పేట పోస్టు, విజయవాడ.



మూడుతరాలవారి అభిమానం పొందినవి


అక్షరాలలా తయారవుతుంది. యింతకీ కిచ్చేవి నెలకీనలభై రూపాయలు. హోటలులో సర్వరు పని నయం. ఈ నలభై రూపాయలూ భోజనం, టిఫెనూ పెట్టియిస్తారు. ఈ రోజుల్లో యిదెల్లా సరిపోతుంది... మేము extra పనిచెయ్యక తప్పదు. రాత్రిళ్ళు పనిచెయ్యాలి. గత నెల యీ రాత్రీ మేలుకోడంతో ఆరోగ్యం చెడి మంచమెక్కాను. వంద రూపాయలు అప్పయింది. ఎప్పుడు తీర్చగలను? యిప్పటికి ఇరవై ఏళ్ళబట్టి యీ పని చేస్తున్నాను. ఇప్పటికీ నాకు భవిష్యత్తుమీద ధైర్యంలేదు. ఈ ఉద్యోగం ఎప్పుడూ ఉంటుందన్న నమ్మకంలేదు. ఏ నిముషాన యీ ఉద్యోగం ఊడుతుందో తెలియదు. గవర్నమెంటు ఉద్యోగానికైతే యీ బాధలేదు. ఏదో నిశ్చలత్వం ఉంటుంది.

యీక్షణాన నన్ను యజమాని పొమ్మంటే ఎర్రని ఏగానీ లేకుండా ఎర్రని ఎండలో బయట పడాలి-బతకలేక చస్తున్నాం-చావలేక బతుకుతున్నాం - ఏవో శాసనాలున్నాయట మాకోసం. అవి కాగితాలమీదే! న్యాయం డబ్బుతో కొనుక్కోవాలి. మాదగ్గిర డబ్బులేదు. రోజులు బాగున్నాయని ఎల్లాఅనుకోమంటారు. లోకంలో ఏదో సౌఖ్యంకోసం రోజులు బాగులేవనడానికీ మేము ఆమాట అనడానికీ తేడాఉంది. కడుపు నిండేకకూడా రోజులు బాగులేకపోవచ్చు, కాని ఆ బాగులేకపోవడం వేరు" అన్నాడు.

బాగుంది—యీ బాగులేక పోవడంలో వివిధ రకాలున్నాయన్న మాట. అతనికొక కొత్తసంగతి తెలిసింది. దీనిలో హెచ్చుతగ్గులు కూడా ఉన్నాయి! కాని యింతకీ ఎవళ్ళబతుకు వాళ్ళకి బాగులేకపోతే, వాళ్ళు రోజులు బాగులేవనడం అతనికేమీ నచ్చలేదు. యీ రోజులు బాగులేవన్న వాదాన్ని అతసంగీకరించలేదు.

అయినా తనకెందుకీ జిజ్ఞాస. కాలేజీలో ఏదో నాటకం ఉందిట. పోయి చూడాలి అనుకున్నాడు. రాఘవరావూ అతనూ బయలుదేరారు సైకిలెక్కి.

నాటకం చూశాడు. "బాగులేనిరోజులు" వీళ్లూ యిదేమాట-తనప్రశ్నకి యీ నాటకంలో కూడా ఏ సమాధానమూ లేదు. చివరికి యీ రోజులు బాగులేవనడమే ఒకనాటకమనీ, పట్టి బూటకమనీ, లేకపోతే ఏదో ఊహామాత్రం అనీ నిశ్చయానికొచ్చాడు. రాఘవరావుమాత్రం అందు కంగీకరించలేదు. ఇద్దరూ యింటికి బయలు దేరారు. వర్షం చిన్న చినుకుగా పట్టుకుంది. త్వరగా యింటికి పోవాలి. దట్టంగా మేఘం వేసి చీకటిగా ఉంది. రాఘవరావు వెనకాల కారేజి మీద కూచున్నాడు. తను తొక్కుతున్నాడు. రాఘవరావుతో వాదిస్తున్నాడు.

"అంతా నాటకం: రోజులు రోజుల్లాగా ఉంటాయి. ఎటొచ్చీ మన సంతృప్తిలో భేదం అంతే. అందుకని రోజుల్ని తిడతారు. మనుషులు. గడచిన రోజులు, యిప్పటిరోజులు, ముందు రాబోయేవి, అన్నీ ఒక్కలాగానే ఉంటాయి. గడచిన రోజుల్లో కష్టాలు మరిచిపోతాము. యిప్పటి రోజుల్ని తిడతాము. ముందు వెళ్లిపోయిన రోజులు బాగానే ఉన్నాయట, యిప్పుడే మండిపోతున్నాయట, కాని విచిత్రమేమిటంటే యీమాటే అన్నితరాలవాళ్ళూ, అన్నిరోజుల్లో అన్నారు! భవిష్యత్తులోనూ యిలాగే అంటారు. యీ రోజులు బాగులేవు - వెనకే నయం అని! ఆ మాట కొస్తే, మొట్టమొదటి పురుషుడు మొట్ట మొదటి స్త్రీతో యీ మాటే అని ఉంటాడు. "రోజులు బాగాలేవు" అని మాట్లాడుతూ సైకిలు తొక్కేస్తున్నాడు. ఎంతవేగంగా తొక్కుతున్నాడో తెలియదు. రోడ్డు కూడా కనపడని చీకటి-మాంచితీవ్రంగా వాదిస్తున్నాడు, ప్రపంచపు అజ్ఞానాన్ని గురించి, సైకిల్‌కి కొన్ని అంగుళాల దూరంలో ఏదో మెరుస్తూ కనిపించింది. బ్రేకులు వేసుకుందుకూ వ్యవధిలేదు. సైకిల్ రిక్షాకి ధన్‌మని తగిలింది సైకిలు. గుండె ఝల్లుమంది. కిందపడిపోయాడు. పోలీసు విజిల్ వినిపించింది. కొంచెం తెప్పరిల్లి చూచాడు. రాఘవరావు దూకేశాడు. అతనికి బట్టలు బురద అయ్యాయి అంతే. సైకిల్ చక్రం రోంబస్‌లాగ వంగిపోయింది. సైకిల్‌రిక్షా చక్రం దెబ్బతింది. చేసినవి అనేక తప్పులు-యిద్దరెక్కడం, లైటులేక పోవడం, రిక్షాకి గుద్దెయ్యడం.

ఆ సైకిలు పోలీసుకి వప్పజెప్పి, పేరూ,ఆచూకీ యిచ్చి యింటికొచ్చాడు.

అన్ని తతంగాలూ అయి, కేసునుంచి ఎల్లాగో తప్పించుకుని, బయటపడేసరికి సైకిలురిక్షావాడికో అయిదురూపాయిలూ, తనసైకిలుకో పదిరూపాయిలూ, పోలీసువాడికో పదీ... చివరికి నాన్నగారికానెల మళ్ళీ డబ్బుకి రాయాలిసొచ్చింది. కొంపంతా మునిగిపోయినట్టు అదిరిపడి చక్కా వచ్చాడు నాన్న... పంపిన డబ్బంతా ఎవరికి పెడుతున్నాడో అని కంగారుపుట్టింది ముసలాయనకి—ఆయనమాత్రం ఎక్కడనుంచి తెస్తాడు! విషయం పూసగుచ్చినట్టు చెప్పకపోయినా, కొంత చెప్పాడు-కొంత ఉత్ప్రేక్షించి. నాన్న భైరవ రూపం ధరించి, "ఇలా వెధవపనులుచేస్తే చదువు మానిపించి యింటికితీసుకుపోతాను, వ్యవసాయానికేనా పనికొస్తావు గాడిదా," అని లంకించుకున్నాడు. తిట్లన్నీపడి, ముఖం గందగడ్డచేసుకుని కాలేజీకి బయలుదేరాడతను, ఆవేళ సైకిలు పట్టుకెళ్ళలేదు.

వీడు మొహం వేలాడెయ్యడంచూచి రాఘవరావన్నాడు.

"ఏమిరా... ఇల్లా ఎందుకు యిదవుతావు... యీమాత్రం దానికే! వెధవది అనవసరంగా వచ్చింది... ఆవేళ నాటకానికి వెళ్ళకపోయినా బాగుండును... యింతకీ మించిపోయింది... ఏం చేస్తాం?"

అతనుమొహం ఆలాగేపెట్టుకుని నీరసంగా, రోజులు బాగులేవురా! అన్నాడు... రాఘవరావు తెల్లబోయాడు. వీడేనా యింతకాలమూ తనకీ మాట అర్థంకాలేదని వాదించింది! అని.

